# ఓటుకు వేళాయె..!



కేంద్రం వద్ద డీఎస్పీ, సీఐలకు సూచనలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్



ఎన్నికల సిబ్బందికి విధులు కేటాయిస్తున్న రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్





మణుగూరు : పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

మణుగూరు టౌన్, మే 12: ఓటర్లను స్వాగతించేందుకు పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. మణుగూరు జడ్పీ హైస్కూల్‌లో ఎన్నికల కేంద్రాల పీవోలు, ఏపీవోలకు ఎన్నికల సామగ్రిని అధికారులు పంపిణీ చేశారు. దీనిని రిటర్నింగ్ ఆఫీసర్/ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ పర్యవేక్షించారు. పినపాక నియోజకవర్గంలో 24,450 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటి పరిధిలో 2,03,790 మంది ఓటర్లు ఉన్నారు. ఈవీఎంల కేటాయింపును ఎస్పీ రోహిత్ రాజ్ పరిశీలించారు.

## చర్ల మండలంలో..

చర్ల, మే 12: మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా సమస్యాత్మకమైనవి ఉన్నట్లుగా అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో చర్ల మండలం ఉంది. దీనికి సమీపంలోగల అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం ఉంది. అందుకే, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. భద్రతా చర్యలు చేపట్టారు. చర్లలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. దీంతో ఈ కేంద్రం ప్రవేశ ద్వారం వద్ద 'మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం' ఫ్లెక్సీలను అధికారులు ఏర్పాటు చేయించారు.

## సారపాక మండలంలో..

సారపాక, మే 12: మండలంలో 57 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 49,813 మంది ఓటర్లు ఉన్నారు.

## ఆళ్ళపల్లి మండలంలో..

ఆళ్ళపల్లి,మే 12: మండలంలోని 11 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9,046 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

## దుమ్ముగూడెం మండలంలో..

దుమ్ముగూడెం, మే 12: మండలంలోని మొత్తం 40 పోలింగ్ కేంద్రాల పరిధిలో 36,065 మంది ఓటర్లు ఉన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

## పినపాక మండలంలో..

పినపాక, మే 12: మండలంలోని 38 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కనీస వసతులను అధికారులు పూర్తి చేశారు. ఈ కేంద్రాల పరిధిలో 27,000 మంది ఓటర్లు ఉన్నారు.

## భద్రాచలం నియోజకవర్గంలో..

భద్రాచలం, మే 12: భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో 1,52,683 మంది ఓటర్లు (పురుషులు 72,994 మంది, మహిళలు 79,681 మంది, ఇతరులు ఎనిమిది మంది) ఉన్నారు. మొత్తం 176 పోలింగ్ బూత్‌లు ఏర్పాటయ్యాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోగల పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని సిబ్బందికి భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అధికారులు ఆదివారం అందజేశారు. దీనిని భద్రాచలం ఆర్డీవో, ఏఆర్వో దామోదరరావు, ఏఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు.

## చంద్రుగొండలో...

చంద్రుగొండ, మే 12: సోమవారం జరిగే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంపీడీవో అశోక్ తెలిపారు. ఆదివారం సాయంత్రానికి ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేశబూమని ఎస్సై మాచినేని రవి అన్నారు.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో..

అన్నపురెడ్డిపల్లి, మే 12: మండలంలోని 10 పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 20 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. అధికారులు ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు చేపట్టారు.

## అశ్వారావుపేట రూరల్‌లో..

అశ్వారావుపేట రూరల్, మే 12: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో పోలింగ్ కేంద్రాలల్లో అధికారులు సామగ్రి అందించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో టెంట్లు వేశారు. పురుషులకు, మహిళలకు వేరువేరుగా కౌంటర్లు ఏర్పాట్లు చేశారు.

## ఇల్లెందులో...

ఇల్లెందు, మే 12 : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మహబుబాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు ఆదివారం ఏర్పాట్లు పూర్తిచేశారు. పట్టంలోని సింగరేణి ఎయిడెడ్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి 1,998 మంది సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి ఏర్పాటు చేసిన వాహనాల్లో 242 పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో 2,25,097 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,09,888 మంది పురుషులు, 1,15,205 మంది స్త్రీలు, నలుగురు ట్రాన్స్‌జెండర్ ఓటర్లున్నారు.

## టేకులపల్లిలో..

టేకులపల్లి, మే 12 : మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది సామగ్రితో ఆదివారం చేరుకున్నారు. 8 సెక్టార్లు, 7రూట్లలో మొత్తం 44పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కాగా మొత్తం 41,183 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 20,297, మహిళలు 20,886 ఉన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగభవాని మాట్లాడుతూ.. మండలంలో పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. 44పోలింగ్ కేంద్రాలలో 264 మంది ఎన్నికల సిబ్బంది ఆధ్వర్యంలో పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఇల్లెందు : పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది



దుమ్ముగూడెం : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

## ఓటు హక్కు భారం కాదు.. బాధ్యత

### వయోజనులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి: భద్రాద్రి కలెక్టర్



భద్రాద్రి కొత్తగూడెం, మే 12 (నమస్తే తెలంగాణ): జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వయోజనులందరూ తమ ఓటు హక్కు బాధ్యతగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఓటు హక్కు భారం కాదని, మన బాధ్యతని స్పష్టం చేశారు. దేశ పౌరులందరికీ భారత రాజ్యాంగం కల్పించిన ఈ ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. సమర్థవంతమైన పాలకుడిని ఎన్నుకునే అవకాశం ఈ ఓటు హక్కు ద్వారా మాత్రమే కలుగుతుందని అన్నారు. జిల్లాలో వందశాతం పోలింగ్ నమోదయ్యేలా బాధ్యత తీసుకోవాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఫ్యాన్‌లు తదితర మౌలిక సౌకర్యాలన్నీ కల్పించినట్లు వివరించారు. భద్రాద్రి జిల్లాలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




చర్ల : మహిళా అదర్శ పోలింగ్ కేంద్రం



పినపాక : ఎన్నికల విధుల్లో పోలింగ్ సిబ్బంది



అన్నపురెడ్డిపల్లి: సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వస్తున్న అధికారులు



టేకులపల్లిలో ఎన్నికల కేంద్రానికి వస్తున్న సిబ్బంది

## పలు గ్రామాల్లో అకాల వర్షం..

అశ్వారావుపేట రూరల్, మే 12: మండలంలోని తిరుమలకుంట, మామిళ్లవారిగూడెం, ఆసుపాక, నారాయణపురం, బచ్చువారిగూడెం, గుమ్మడవల్లి, గాండ్లగూడెం, అనంతారం, మల్లాయిగూడెం గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం గాలి దుమ్ముతో పాటు వర్షం కురిసింది. వేరుశనగ, మామిడి, అరటి, పుగాకు తోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ, పొగాకు పంటకు లక్షల పెట్టుబడి పెట్టామని, చేతికి పంటలు వచ్చిన సమయంలో అకాల వర్షంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## చర్లలో వాన

చర్ల, మే 12: మండలంలోని పలుచోట్ల ఆదివారం సాయంత్రం అరగంటపాటు వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

## ఆదివాసీల ఆరాధ్యదైవం సోయం గంగులు



సోయం గంగులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న తాటి వెంకటేశ్వర్లు

దమ్మపేట, మే 12: మన్యం వీరుడు సోయం గంగులు ఆదివాసీల ఆరాధ్య దైవమని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నారు. సోయం గంగులు వర్ధంతి సందర్భంగా ఆదివారం దమ్మపేట గంగులు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నేటి తరానికి గంగులు జీవితం స్ఫూర్తి అని అన్నారు. కార్యక్రమంలో కొర్స వెంకటేశ్, తెల్లం రామారావు, రామూర్తి, గడ్డం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రామయ్యకు స్వర్ణ పుష్పార్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 12: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు ఆదిఆరం 108 పుష్పాలతో అర్చన చేశారు. బేడా మండపంలో నిత్య కల్యాణ మూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

## ద్విచక్ర వాహనానికి నిప్పు

బూర్గంపహాడ్, మే 12: స్థానిక గౌతంపురం పాండవుల కాలనీ నివాసి డేగల వెంకటేశ్వర్లు తన ద్విచక్ర వాహనాన్ని శనివారం రాత్రి ఇంటి ముందు పార్క్ చేశారు. ఉదయం చూసేసరికి అది దగ్ధమై ఉంది. దుండగు(డు)లు ఎవరో కావాలనే నిప్పంటించి ఉంటారని పేర్కొంటూ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253

NT-3277

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## రూ.77 లక్షల నగదు హాంఫట్

### ఏటీఎంల్లో నగదు పెట్టే సిబ్బంది చేతివాటం
### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
### కేసు దర్యాప్తు చేస్తున్న పాల్వంచ పోలీసులు

పాల్వంచ, మే 12 : ''వారు ఏటీఎం మిషన్లను తెరిచి అందులో డబ్బులు పెట్టే ఏజెన్సీకి చెందిన సిబ్బంది.. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో ఉన్న ఏటీఎం సెంటర్లలో నిత్యం డబ్బులు జమ చేయడం వారి పని.. అయితే ఎంతో నమ్మకంగా ఉండాల్సిన ఆ సిబ్బందికి డబ్బులను చూసి దుర్బుద్ధి పుట్టింది.. ఏటీఎంల్లో పెట్టాల్సిన నగదును అందినకాడికి దోచుకున్నారు.. అనుమానం వచ్చిన కంపెనీ ఇంటర్నల్ ఆడిటర్ అసలు విషయాన్ని బయటపెట్టారు.. దీంతో వారి గుట్టు రట్టైంది'' ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా హన్మకొండలో ఉన్న సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీ వారు బ్యాంకుల నుంచి నగదును స్వీకరించి ఏటీఎం మిషన్లలో ఆ నగదును పెడుతుంటారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రామవరం-2 ఇంక్లైన్‌కు చెందిన ములుగురి రాజశేఖర్, కొత్తగూడెం గాజులరాజం బస్తీకి చెందిన కందుకూరి సందీప్ ఆ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరు ఆ ఏజెన్సీ ద్వారా కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లోని ఏటీఎం సెంటర్లలో డబ్బులు పెడుతుంటారు. ఈక్రమంలో కొత్తగూడెం, పాల్వంచ ఏటీఎంల్లో రూ.76,77,400 నగదు కొరత ఏర్పడినట్లు కంపెనీ ఇంటర్నల్ ఆడిటర్ రాజు ఈ నెల 8వ తేదీన గుర్తించారు. రాజశేఖర్, సందీప్‌లు కంపెనీని మోసం చేసి ఆ మొత్తాన్ని పక్కదారి పట్టించారని గ్రహించారు. ఈ మేరకు కంపెనీ మేనేజర్ జితేందర్ పాల్వంచ పట్టణ పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఎస్సై బాణాల రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

### ముగ్గురికి తీవ్ర, 20 మందికి స్వల్ప గాయాలు



కల్వర్టు పక్కన కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న భద్రాచలం డీఎం రామారావు

సారపాక, మే 12: బస్సు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ప్రయాణికులు తెలిపిన వివరాలు.. ఆర్టీసీ మణుగూరు డిపో పల్లె వెలుగు బస్సు (టీఎస్28 టీఏ 2219) ఆదివారం భద్రాచలం వెళ్తున్నది. సారపాక-మోతేపట్టీనగర్ గ్రామాల మధ్యలోగల ఓ కల్వర్టు వద్దకు రాగానే, ఎదురుగా ఒక్కసారిగా ఆటో అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టు వంతెన కిందనున్న కాలువలోకి దూసుకెళ్లింది. అందులోని మొత్తం 35 మంది ప్రయాణికుల్లో ముగ్గురికి తీవ్రంగా, 20 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని బూర్గంపహాడ్ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, స్థానికు యువకులు కలిసి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బస్సు ముందు భాగం దెబ్బతిన్నది. డ్రైవర్ అలీ, కండక్టర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. బస్సు అదుపు తప్పడంతోనే డ్రైవర్ సమయ స్ఫూర్తితో వ్యవహరించడంతో పెను ముప్పు తప్పింది. క్షతగాత్రుల్లో ఎవరికీ ప్రాణాపాయం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. క్షతగాత్రులను భద్రాచలం డిపో మేనేజర్ రామారావు పరామర్శించారు.



నర్సులు, తల్లులను సన్మానిస్తున్న దృశ్యం

## నర్సులు, తల్లులకు సన్మానం

చుంచుపల్లి, మే 12: మదర్స్ డే, సిస్టర్స్ (నర్సులు) డే సందర్భంగా మాతృమూర్తులను, నర్సులను నాయకులు, స్వచ్ఛంద సంస్థ బాధ్యులు ఆదివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పాకాల లక్ష్మి, కరీష రత్నకుమారి, మేదిని లక్ష్మి, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, సరోజ, రమ్య, షమీమ్, శాంతి, నాగమణి, ప్రమీల, పుష్ప, రేణిగుంట్ల లక్ష్మి, విజయ, అనిత తదితరులు పాల్గొన్నారు.



మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

## బొగ్గు తరలింపును అడ్డుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న లారీ యజమానులు

సత్తుపల్లి టౌన్, మే 13: సత్తుపల్లి కేంద్రంగా కొత్తగూడెం రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు తరలించే బొగ్గును అడ్డుకుంటామని సత్తుపల్లి లారీ యజమానుల సంఘం హెచ్చరించింది. ఆదివారం ఉదయం సత్తుపల్లిలోని లారీ యజమానుల సంఘం భవనం వద్ద విలేకరులతో మాట్లాడారు. 14వ తేదీ నుంచి కొత్తగూడెంలోని రుద్రంపూర్ కోల్ హ్యాడ్లింగ్ ప్లాంట్‌కు తరలించేందుకు సింగరేణి సంస్థ టెండర్లు పిలిచిందని, 14వ తేదీ నుంచి ఈ రవాణా ప్రారంభం కానుందని, ఈ రవాణాను తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. సత్తుపల్లిలో సింగరేణి సంస్థను ఆధారం చేసుకుని 745 లారీలు ఉన్నాయని, ఈ లారీలకు కాకుండా కాంట్రాక్టర్ ద్వారా బొగ్గును సరఫరా చేసేందుకు సింగరేణి సంస్థ కుట్రపన్నిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఈ చర్యను తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు కొండపల్లి రమేశ్‌రెడ్డి, కార్యదర్శి కిజర్, మాజీ లారీ యాజమానుల సంఘం అధ్యక్షుడు పీఎల్.ప్రసాద్, మౌలాలి పాల్గొన్నారు.

## మధిరలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



నర్సులను సన్మానిస్తున్న దృశ్యం

మధిర, మే 12: మధిర ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సులను శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడంలో నర్సులు బాధ్యతగా వ్యవహరిస్తారని కొనియాడారు. కార్యక్రమంలో పోతుల ప్రసాదరావు, జింకల కోటేశ్వరరావు, రంగిశెట్టి శ్రీనివాసరావు, ఆదూరి అబ్రహం, ఊటుకూరు భాస్కర్‌రావు, మైనేడి పూర్ణచందర్‌రావు, గండూరి రాంబాబు, భూక్యా హనుమా, యలమద్ది రాము, బజాజ్ సాంబిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, సుకూర్, మేకల ఉపేంద్ర, చిదిరాల సత్యనారాయణ, అబ్దుల్‌హనీఫ్, రెహమాన్, కూరపాటి శ్రీను, దాచేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.